



ఆమె అటకమీద నుంచి క్రిందకు చూసింది!

నేలనిండా దుమ్ము పేరుకుపోయి ఉంది. గోడలు మాసిపోయి ఉన్నాయి. మాసిన గోడలమీద సాలెపురుగులు తమాషాగా పాకుతూ కదులుతున్నాయి.

గదినిండా ముతకవాసన.

మూసివున్న కిటికీ తలుపుల సందులోంచి సన్నని వెలుగు గదిలోకి వస్తోంది.

మళ్ళీ పగలయింది.

ఇంకా ఇలాటి పగళ్ళు మూడు, రాత్రులు మూడు ఇంకా గడవాలి.

అపుడు తాను కోరుకున్న క్షణాలు వస్తాయి.

ఆమె అటకమీదనుంచి క్రిందకు దుమికింది.

మెల్లగా తలుపు సందులోంచి ప్రక్క గదిలోకి వెళ్ళింది. అదే పడకగది!

ఆ గదిలో మంచంమీద పాతపరుపు ఒక్కటేవుంది. కొత్తపరుపు దుప్పట్లు ఏవీలేవు. గదిలో బట్టలస్టేండు బోసిగావుంది.

తూర్పు గోడకున్న "వార్డురోబ్" తలుపులు బోర్లా తెరిచిఉన్నాయి. వాటి అరలలో పాతపేపర్లు, చిరిగిపోయిన చందమామ పుస్తకాలు తప్ప వస్తువులు ఏవీలేవు. బొద్దింకలు గోడ కంతల్లోంచి బయటకువచ్చి అరలో ఇటూఅటూ పాకుతున్నాయి.

గోడకు బిగించివున్న ట్యూబ్‌లైటు చుట్టూ ఏవో పేట్ల తెలియని పురుగులు చిన్నచిన్న గూళ్ళుకట్టేయి.

మూసివున్న కిటికీ దగ్గరలోనే పెద్ద టేబిలుఉంది. దానికి ఆన్చి నిలువుటద్దం ఉంది. టేబిలుమీద పాతగుడ్డ, జోళ్ళు తుడిచే బ్రష్ అస్తవ్యస్తంగా పడివున్నాయి.

ఒకబల్లి టేబిలుమీదకు పాకివచ్చి పురుగుల్ని పట్టి తింటోంది.

అద్దంముందు ఖాళీ అయిపోయిన బొట్టుసీసా పడివుంది.

ఆమె అద్దం ఎదురుగా నిలబడింది!

అద్దంలో ఆమెకు తన ప్రతిబింబం కనిపించలేదు!

ఆమెకు ఏడుపు వచ్చింది!

అంతలోనే కోపం వచ్చింది!

వెంటనే ఆవేశంకూడా వచ్చింది!

ఇంకా మూడు రోజులు గడవాలి.

అంతవరకూ ఓపిక పట్టాలి. ఆ తరువాత తాను చేయబోయేపని తలుచుకుంటే సంబరం వేసింది.

ఆమె మెల్లగా మంచం దగ్గరకు వెళ్ళి పాత పరుపుమీద కూలబడింది. మంచం నాలుగు మూలలూ ఆప్యాయంగా తడిమింది! తలగడ వైపు ప్రేమతో చూసింది.

ఆ మంచాన్ని వదల్లేకపోతోంది ఆమె.

సరిగ్గా పదహారు నెలలక్రితం ఒకనాటి రాత్రి ఈ పరుపుమీదే జీవితంలోని మొదటి తీపి అనుభవాన్ని రుచిచూసింది ఆమె! ఆ తీపి అనుభవంతోపాటు తాను కోల్పోయిన శీలం విలువ అమూల్యమని కొద్దిరోజుల తరువాతనే ఆమెకు తెలిసింది. ఆ సంఘటన ఎంత మరచిపోదామనుకున్నా మరుపుకు రావటంలేదు.

పదహారు నెలలక్రితం ఆ రాత్రి-

తొమ్మిది గంటలవేళకు అంట్లగిన్నెలుతోమి వంటింటిలో బోర్లించింది. తరువాత పెరటి తలుపులు బిగించి వచ్చింది. గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి పడకగదిలో ఉంచి "బాబుగారూ! నేను వెళుతున్నా! వీధి తలుపులు వేసుకోండి! అంది అతనితో.

అతడు చదువుతున్నపుస్తకంమూసి "అంత అర్జెంటుగా వెళ్ళాలా! ఇంకో గంట ఆలస్యంగా వెళితే కొంపలంటుకుంటాయా?" అన్నాడు నవ్వుతూ.

ఆలస్యమైనా ఫర్వాలేదు. పనివుంటే చెప్పండి!" అంది మామూలుగానే. అతను మెల్లగా మంచందిగి వచ్చేడు.

"చూడు! అమ్మగారు, పిల్లలు ఈవేళ ఊరు వెళ్ళేరుకదా! రేపు సాయంకాలందాకా రారు. అందుకని ఇంట్లో అవసరాలన్నీ నువ్వేచూడాలి" అన్నాడు.

"అలాగే బాబూ! అమ్మగారు కూడా చెప్పారు. రేపు ఉదయం ఆరో గంటకల్లా వచ్చేస్తా. మీ కాఫీ, వంటా అన్నీ నేనే చేస్తాను. ఆఫీసుకి ఆలస్యం కాకుండా కేరియరు కట్టిస్తాను" అంది.

అతడు నవ్వుతూ "అంతేనా? మరి మిగిలిన పనులో? అన్నాడు. ఆమె అతనివంక అనుమానంగా చూసింది. అతని వంటిమీదనుంచి

మత్తయిన సెంటువాసన తెరలావచ్చి ఆమెను కమ్మింది. అతడు చను వుగా దగ్గరకువచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. గాజులు గలగల మన్నాయి.

ఆమె మనసు రెపరెపలాడింది.

యవ్వనంలోకి ప్రవేశించేక మొట్టమొదటి పురుషస్పర్శ అది.

ఆమె భయంతో వణికిపోయింది.

అతనితో పెనుగులాడాలనుకుంది.

గట్టిగా గొంతెత్తి అరవాలని కూడా అనుకుంది.

అతన్ని బలంగా దూరానికి నెట్టివేయాలని అనుకుంది.

కానీ, ఏమీ చేయలేకపోయింది.

అతడు ఆమెను పూర్తిగా ఆక్రమించుకున్నాడు రెండు నిమిషాల లోనే!

"అమ్మగారు చిలకలా ఉంటారుకదా! నామీద మోజెందుకుబాబూ" అని అడిగింది అరగంట తరవాత మంచంమీదనుండి లేస్తూ.

అతడు చిరునవ్వుతో "చిలకల్లో చాలా రకాలుంటాయి. ఒక్కో చిలకది వొక్కో ఆనందం!" అన్నాడు.

తరువాతిరోజునే అమ్మగారు, పిల్లలు ఊరినుండి తిరిగి వచ్చే శారు.

అతడు ఆమెను మరిచిపోయాడు.

అమ్మగారూ, అతడూ పడకగదిలోకి వెళుతూవుంటే చాలారోజుల వరకూ అసూయగా వుండేది ఆమెకు.

దినాలు గడుస్తున్నకొద్దీ ఆ అనుభవాన్ని మరిచిపోవాలనుకుంది. అయితే, తను అనుభవించిన ఆనందంయొక్క ఫలితం తనలో ఏర్పడు తోందని ఆమెకు ఆలస్యంగా తెలిసింది. ఆ సంగతి తెలిసేక ఆమెకు ఆ రాత్రి నిద్రపట్టలేదు! వొడలంతా చెమటలు కమ్మేయి.

గుండె భయంతో అవిసిపోయింది.

మరునాడు రహస్యంగా అతనితో అసలు విషయం చెప్పేసింది.

"కొంప ముంచేవ్!" అన్నాడు బెదిరిపోతూ. ఆమాట అన్నప్పుడు అతని ముఖంలోని భయాన్ని స్పష్టంగా చదవగలిగింది.

ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు.

కొంప ముంచింది అతడే! పైగా తనమీదకు తప్పు తోసేస్తు న్నాడు.

సాయంకాలం మాత్రలు తెచ్చి పెరటిగూట్లో పెడతాను. వేసుకో!" అన్నాడు. అలాగేనన్నట్లు మౌనంగా తల ఊపింది.

ఓ సాయంకాలం కనుచీకటి పడేవేళ పెరట్లో తారాడుతూ గొణుగు తున్నట్లు అ గేడు అతడు. "ఏమయింది" అని.

"ఏమీ అవలేదు!" అంది.

"సరేలే!" అంటూ కాలుకాలిన పిల్లిలా వెళ్ళిపోయేడు.

"సరేలే" అంటే అతని నిర్ణయం ఏమిటో ఆమెకు అర్థంకాలేదు. కాని అదేరాత్రి ఎనిమిదిగంటలవేళ బెడ్‌రూంలో టేబిలుఫేను అమర్చి ప్లెగ్ పెడుతూ ఉంటే కొంత అర్థమైంది. పూర్తిగా అర్థం చేసుకునే లోగానే ఏదో బలమైన శక్తి ఆమెను తోసేసింది. వెనుకనుండి కర్రతో అదిమిపెట్టి కరెంట్‌షాక్‌తో అతడే చంపేశాడని ఆమెకు అర్థమైంది.

ఆమె చచ్చిపోయింది.

ప్రమాదవశాత్తు కరెంటుషాక్ తగిలి చనిపోయిందని అతడు అంద రికీ చెప్పేడు. మంచి పనిమనిషి చనిపోయిందని ఇంట్లో అందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. అతడూ కన్నీరు కార్చేడు!

చనిపోయిన నక్షత్రం మంచిదికాదు కనుక ఏడాదిపాటు ఇంటిని పాడుపెట్టాలన్నారు. ఇంటిలో సామానులన్నీ వేరే అద్దె ఇంటిలోకి మార్చి ఈ ఇంటికి తాళాలు వేసి వెళ్ళిపోయారు

అప్పటినుండీ ఆమె ఇక్కడే గడుపుతోంది. ఆమెకు ఆకలిలేదు! నిద్రలేదు! దాహం అంతకంటేలేదు. ఒకే ఒక కోరికమాత్రం ఉంది.

అన్యాయంగా తనను హతమార్చినందుకు అతన్ని, ఆ సంసారాన్ని పట్టుకు పీడించాలని! వాళ్ళను అనుక్షణం హింసించాలి.

అతడూ, అతని భార్యా చాలా అన్యోన్యంగా ఉండేవారు. పిల్ల లిద్దరూ కూడా బొద్దుగా ఆరోగ్యంగా ముత్యాల్లా ఉండేవారు. చక్కని కుటుంబం వాళ్ళది. తనతో సాంగత్యం తరువాత తనకు చేసిన అన్యాయం తప్ప అతడిలో చెడ్డగుణాలు లేవు. దురలవాట్లు కూడా ఏమీలేవు! తనతో

తంతులన్నీ ముగించేక భోజనాలు పెట్టేరు.

పగలంతా హడావుడిగా జరిగింది.

వెలుతురు తట్టుకోలేక ఆమె అటక దిగి రాలేదు. అదీగాక ముగ్గులూ, పూజలూ చూస్తే ఆమెకు క్రిందికి దిగి రావటానికికూడా భయం కలిగింది. సాయంకాలం చీకటిపడే సమయంలో అటక చివరకు వచ్చి మెల్లగా చూసింది. పిల్లలిద్దరూ బొద్దుగా తయారయ్యేరు. గుసగుసలాడుతూ ఇంటిలో చలాకీగా తిరుగుతున్నారు. అతడూ, అతని భార్యా మాత్రం కొంచెం సన్నబడినట్లు అనిపించింది. అతడి భార్య ముఖంలో మునుపటి చలాకీతనం లేదు. కాంతితో వెలిగిపోయే ఆమె కళ్ళు వెలవెల బోతున్నట్లు అనిపించింది. అతడు మనిషి చిక్కినా ముఖంమాత్రం బుగ్గలతో లావెక్కింది. ఇంతకుముందులేని చిన్న బొజ్జ వేరుగా కనిపిస్తోంది. మనిషిలో మునుపటి దృఢత్వం లేదు. అతడి కళ్ళక్రింద నల్లని చారలు ఏర్పడ్డాయి. ఈ ఒక్క సంవత్సరంలోనూ అయిదు సంవత్సరాల వయసును మింగిన వానిలా అతడు కనబడ్డాడు.

ఆ రాత్రి అలికిడి ముగిసేదాకా అటక దిగిరాలేదు ఆమె.

తరువాత మెల్లగా దిగి పిల్లల గదిలోకి వెళ్ళింది. వాళ్ళిద్దరూ నిద్రపోతున్నారు. తరువాత అతడి గదిలోకి వచ్చింది. అతడి గదిలో కొత్త మంచంమీద కొత్త పరుపువేసి మంచి దుప్పటి పరిచివుంది. గది స్వరూపమే మారిపోయినట్లనిపించింది, అంతా అమర్చినట్లు చక్కగా తయారయి ఉంది. దుమ్ము పేరుకుపోయి నిన్నటివరకూ చెత్తగావున్న నేల ఇప్పుడు తళతళ మెరిసిపోతోంది.

అతడు కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

అతడి ఎదురుగా ఉన్న టీపాయ్‌మీద గ్లాసు, సీసా ఉన్నాయి! సీసాలో ద్రవం తళతళ లాడుతోంది. ఇది అతడికి కొత్త అలవాటు అనుకుంది ఆమె. దగ్గరలోనే అతడి భార్య నిలబడివుంది. కనులు నిండిన నీళ్ళతో! ఆమె క్షణంసేపు భార్యాభర్తలవంక చూస్తూ ఉండిపోయింది.

"ఏమండీ! మీకు పుణ్యం ఉంటుంది. నామాట వినండి. ఈ పదకొండు నెలల్లోనూ మీరు ఎంత మారిపోయారో మీకు తెలియడంలేదు. ఆరోగ్యం పూర్తిగా నాశనం కాకముందే దీనిని మానండి!" అంటూ అభ్యర్థిస్తోంది భార్య.

"మొదలెట్టావా మళ్ళీ! ఫో! ఇక్కడ్నుంచి! రోజు వెధవసొద! నేను తాగుతాను! నువ్వు అరచి గింజుకున్నా మానను! నా ఇష్టం! నా డబ్బు నేను తాగుతాను!" అతడి మాటలు ముద్దగా ఉన్నాయి.

అతని కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి.

అతడి ముఖం మనిషిరక్తం రుచిమరిగిన పులిముఖంలావుంది. అతని జుత్తు చెదిరిపోయి అస్తవ్యస్తంగా వుంది.

"ఏమండీ! మీకిది న్యాయంకాదు. ఇది మొదలు పెట్టిననాడే మీకు చెప్పేను. అలవాటయితే మానలేరని! మొదటిరోజు పార్టీలో బలవంతం వల్ల తాగేనన్నారు. తరువాత స్నేహితులకోసం తాగేనన్నారు. తరువాత కంపెనీకోసం తాగేరు. తరువాత్తరువాత పార్టీలు పోయాయి. స్నేహితులుపోయారు. కంపెనీ ఒంటినెప్పులు అన్నీ పోయాయి. పోయినంత ఆస్తిపోయింది. ఆరోగ్యమూ పోయింది! ఇంకా ఎందుకండీ ఈ అలవాటు దయచేసి నాకోసం మానెయ్యండి. ఈ అలవాటుతో మీరు బంధువుల మధ్య స్నేహితులమధ్య ఎంత చులకన అయిపోతున్నారో గుర్తించారా? ఏనాడూ చేయిచాచి ఒక్క రూపాయి కూడా ఎవరిదగ్గరా అప్పుచెయ్యని మీరు నెలాఖరురోజులలో విస్కీసిసాలకోసం అప్పు తెస్తున్నారు. క్రితం వారంలో మీరు తీసికెళ్ళిన చేబదులు తిరిగి ఇవ్వమని పక్కింటాయన వాళ్ళ అబ్బాయిని మన ఇంటికి కబురంపితే నేను సిగ్గుతో ఎలా కుంచించుకుపోయానో మీకు తెలీదు. మీరు గదిలో సీసా, గ్లాసుతో కూర్చుంటే గదివంక చూడటానికే వణికిపోతున్నారు పిల్లలు. వాళ్ళకీ మీకూ మధ్య పెద్ద అగాధం ఏర్పడిపోతోంది. మీ రొక్కదినం కేంపువెళితే బెంగెట్టుకు

పోయేపిల్లలు ఇప్పుడు మిమ్మల్ని చూస్తేనే జడుసుకుంటున్నారు. ఎందుకని? మీకు చికాకు కోపంఎక్కువైపోయింది. తాగుడుతప్ప ఇంకదేనిమీదా మీకు ఆశక్తిలేదు. ఇంటిలో వచ్చిన మార్పు అన్నిటికీ మీ తాగుడే కారణం. ప్లీజ్ నేను కోరుకునేది ఈ ఒక్కటే! ఈ వ్యసనం మానెయ్యండీ! మీరు మునుపటి మనిషి అవండి! అంతే!" అతడి భార్య కంటి నుండి ఏకధారగా వర్షిస్తున్నాయి కన్నీళ్ళు!

అతడు నోటివద్ద ఉంచుకోబోయిన గ్లాసును ఆమెపైపు క్రూరంగా చూసి ఆమె ముఖం మీదికి విసిరేడు. అది ఆమె ముఖానికి బలంగా తగిలి నేలమీద పెద్దశబ్దంతో పడి ఫెళ్ళున బ్రద్దలయింది.

నాకు నీతులు చెప్పకు! నువ్వూ పిల్లలూ కట్టకట్టుకుని గోదాట్లో దిగండి! నేను మాత్రం తాగుడు మానను కాక మానను. అర్థమయిందా? ఆమూలాన కొత్తగళాసు పగిలిపోయింది. మరోటి పట్రా!" ముద్దగా సాగదీస్తూ అన్నాడు.

భార్య అక్కడ నుండి కదల్లేదు- ఏడుస్తూ నిలబడిపోయింది.

"నీకే! తీసుకురమ్మంటే వినపడటం లేదా! అహ! .... వినవట్టం లేదా అని...." అంటూ కుర్చీలోంచి తూలుతూ లేచివచ్చి భార్య వీపువంచి గట్టిగా రెండు చరుపులు చరిచాడు.

నోటిలో చీరకొంగు కుక్కుకొని ఏడుస్తూ నేలమీద కూలబడిపోయింది భార్య.

గోడ అసరాగా మెల్లగా తడుముకుంటూ వంటగదిలోకి వెళ్ళి రోగ్లాసు తెచ్చుకున్నాడు అతను.

సీసాలోని ద్రవం గ్లాసులోకి, గ్లాసులోనుండి అతడి పెదవుల మధ్యకు వెళ్ళిపోయింది.

భర్త అరుపులుకూ, భార్య రోదనకూ పిల్లలిద్దరూ లేచిపోయారు.

భయంగా అడుగులు వేసుకొంటూ గది తలుపు దగ్గరే ఆగిపోయి ఏడుస్తున్న తల్లి వంక నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయారు।

నేలమీదపడిన భార్య లేవలేక మూలుగుతోంది!

ఇంకో అయిదు నిమిషాలుగడవకుండానే మరోగ్లాసు ద్రవం భర్త పెదాలమధ్య ఇంకిపోయింది.

ఆ గదిలో ఒకమూలగా నిలబడి ఈ పరిస్థితి చూస్తున్న ఆమె తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

ఆమె గుండెనిండా ఆనందం పొంగింది!

ఇంక ఈ ఇంటిలో వుండి వ్యక్తుల్ని పీడించాల్సిన అవసరం ఆమెకు కన్పించలేదు!

సీసాలో ద్రవం వంక, ఖాళీ అయిపోతున్న గ్లాసువంక మార్చి మార్చి చూసి తృప్తిగా నిట్టూర్చి, రివ్వున బయటకు ఎగిరి వెళ్ళిపోయింది ఆమె.

[జ్యోతి 1983]